క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఆర్‌ఐ



మహబూబాబాద్ రూరల్ : జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను ఆర్‌ఐ జే.అనిల్‌కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనిల్ కుమార్ 2009 బ్యాచ్ అర్‌ఎస్సైగా, ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించి రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీ అయి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ విభాగంలో ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల దీక్షలు

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం/గూడూరు : మహబూబాబాద్, కేసముద్రం, గూడూరు మండలాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల దీక్షలు మంగళవారం కొనసాగాయి. మహబూబాబాద్‌లో జీపీ కార్మికులు ద్విచక్ర వాహనాలతో నిరసనా ర్యాలీ నిర్వహించారు. కేసముద్రం, ఇనుగుర్తి, గూడూరు మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించారు. గూడూరులో ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలిపారు.

కూలి పెంచాలి

బయ్యారం: పెరిగిన నిత్యావసరధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండా రాజన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు యాదగిరి, విజయ్, మోహన్, మారయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యమ కాలంలో టీఆర్‌ఎస్ బలమెంత’

మహబూబాబాద్: ఉద్యమ కాలంలో టీఆర్‌ఎస్ బలమెంతో మంత్రి హరీశ్‌రావు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004, 2009 ఎన్నికల్లో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్నప్పుడు కమ్యూనిస్టుల బలం తెలియదా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులను అవహేళన చేసి మాట్లాడడం తగదన్నారు.

పీరీల ఊరేగింపు

దంతాలపల్లి : మండలంలోని దంతాలపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాల్లో మంగళవారం పీరీలను వాడవాడలా ఊరేగించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా యువకులు, మహిళలు పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరద ఉధృతి పరిశీలన

తొర్రూరు రూరల్ : మండలంలోని కంఠాయపాలెం, గుర్తూరు గ్రామాల శివారులోని వరద ఉధృతిని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య మంగళవారం పరిశీలించారు. బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. వాగులు, కాల్వల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీపీ వెంట నాయకులు రాఘవరెడ్డి, జంపన్న, కిన్నెర సతీష్ ఉన్నారు.

నూనె ప్యాకెట్ల పంపిణీ

డోర్నకల్ : మండల కేంద్రంలోని శాంతినగర్‌లో విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు వంద మందికిపైగా మహిళలకు మంగళవారం వంట నూనె ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మార్క్, ఫౌండేషన్ ప్రతినిధులు విజయ, తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి

నెహ్రూ సెంటర్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, అధికారులను సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మహబూబాబాద్ సంయుక్త మండలాల కార్యదర్శి పైండ్ల యాకయ్య మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

29న హైదరాబాద్‌లో దీక్ష

గార్ల : జీఓ నంబర్ 317ను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరసన దీక్ష నిర్వహించనున్నట్టు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చింతనిప్పు రమేష్ తెలిపారు. ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బానోత్ సోమని, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వేళల మార్పును ఉపసంహరించుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వేళలను మారుస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, షేక్ యాకూబ్, టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచకొండ ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

ఫుల్లు వాన

జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తుండగా.. సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని వాగులు, చెరువులు ఉప్పొంగాయి. చెరువులు మత్తళ్లు పోయగా.. పలుప్రాంతాల్లో రోడ్డపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక పలు చోట్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోవడంతోపాటు, పలువురి ఇళ్లలోకి వరదనీరు చేరడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



పెద్దవంగర: కొరిపల్లిలో..



గార్ల సమీపంలో పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తున్న పాకాల ఏరు



దోర్నకల్: మున్నేరువాగుకు పెరిగిన వరద



దోర్నకల్: మైనార్టీ పాఠశాల ఆవరణలో వరదనీరు



నర్సింహులపేట: కొమ్ములవంచలో..



గూడూరు- నెక్కొండ రోడ్డులో పాకాలవాగు



కొత్తగూడ: వాగుదాటుతున్న ప్రజలు



కేసముద్రం: ఉప్పరపల్లి సమీపంలో నీట మునిగిన పత్తి చేను



కేసముద్రం: అర్పనపల్లిలో..



నెల్లికుదురు బ్రాహ్మణకొత్తపల్లి మధ్యలో..



గార్లలో కూలిన అన్నపూర్ణకు చెందిన ఇల్లు



మరిపెడ రూరల్: ఉల్లెపల్లి వద్ద ఆకేరు వాగు



కొత్తగూడ: గాంధీనగర్‌లో కూలిన పెంకుటిల్లు



చిన్నగూడూరు: నీట మునుగుతున్న ఆలయాలు



తొర్రూరు రూరల్: గుర్తూరులో..



తొర్రూరు రూరల్: కిష్టాపురంలో కూలిన ఇల్లు



కేసముద్రం: ఇనుగుర్తిలో కుంగుతున్న చెరువుకట్ట

మంత్రి సత్యవతి పీఏ మృతి



కురవి : రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పీఏ మాచర్ల పాపయ్య (51) మంగళవారం మృతి చెందాడు. మండలంలోని గుండ్రాతిమడుగు (విలేజ్)కు చెందిన ఆయన మృతదేహానికి మంత్రి సత్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని మంత్రి ఓదార్చారు. భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, కురవి జెడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ హరిప్రసాద్, బయ్యారం సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, తదితరులున్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్..

ఖానాపురం : వరంగల్ జిల్లా ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మద్దెల సూర్యనారాయణ (54) గుండెపోటుకు గురై మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కుందనపల్లికి చెందిన ఆయన గుండెపోటుకు గురి కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల సాయాన్ని ఎస్సై తిరుపతి, అధ్యక్షుడు శోభన్ ఆధ్వర్యంలో అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ ప్రకాశ్‌రావు, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి..

బయ్యారం : మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలోని వెంకటేశ్వర టైల్స్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఆయన్ను 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

నివాళి

మహబూబాబాద్ రూరల్ : సీపీఐ (ఎంఎల్) ఎన్డీ నాయకుడు దేశెట్టి రామచంద్రయ్య మృతదేహానికి రెడ్యాలలో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్, పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, జిల్లా నాయకులు కొత్తపల్లి రవి, పైండ్ల యాకయ్య తదితరులున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం



చిన్నగూడూరు : మాట్లాడుతున్న మధు

చిన్నగూడూరు : విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జీపుజాతా చేపట్టినట్టు జిల్లా అధ్యక్షుడు పట్ల మధు తెలిపారు. ఆ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత మండలానికి మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీని, ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం దాశరథి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ‘మన ఊరు–మన బడి’లో భాగంగా మొదటి విడతలో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించిందని, ఇప్పటివరకు ఇంకా పూర్తి చేయలేదని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, వార్డెన్ పోస్టులను భర్తీ చేయలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరబాబు, సహాయ కార్యదర్శి జ్యోతి, జిల్లా నాయకులు అనిల్, జశ్వంత్, రజిత, అమీర్, ప్రవీణ్, అఖిల్, యాకన్న, మహేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేట : ఎస్‌ఎఫ్‌ఐ జీపు జాతా మండల కేంద్రానికి చేరుకోగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడారు. మరిపెడ మండల కేంద్రంలో నడుస్తున్న నర్సింహులపేట ఎస్సీ హాస్టల్‌ను నర్సింహులపేటకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వీరబాబు, సహాయ కార్యదర్శి జ్యోతి, నాయకులు రజిత, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణంలో విఫలం

● బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌చౌహాన్



ధర్నా చేస్తున్న వెంకట్‌చౌహాన్, నాయకులు

గార్ల : పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించడంలో పాలకులు విఫలమయ్యారని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్‌చౌహాన్ విమర్శించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పాకాల ఏటి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌చౌహాన మాట్లాడారు. మండలంలోని సుమారు 20 గ్రామాలకు 15 రోజులుగా రాకపోకలు నిలిచిపోవడం బాధాకరమన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మింపజేయకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బ్రిడ్జి నిర్మాణం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రజాప్రతినిధులకు రాబోయే ఎన్నికల్లో ఓటర్లు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిని గెలిపిస్తే ఖచ్చితంగా బ్రిడ్జి నిర్మింపజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ బీఇల్లందు నియోజకవర్గ అధ్యక్షుడు బాదావత్ ప్రతాప్, మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న, నాయకులు సత్యనారాయణ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

బెలూన్లతో నిరసన

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఏటి వద్ద బెలూన్లు పట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు, నాయకులు జంపాల వెంకన్న, మాగం లోకేష్, కె భరత్, తదితరులు పాల్గొన్నారు.

‘ఇల్లెందులో కాంగ్రెస్ గెలుపు ఖాయం’



ప్రచారం చేస్తున్న డాక్టర్ జి.రవి

గార్ల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జి.రవి తెలిపారు. మండలంలోని చిన్నకిష్టాపురం, పెద్దకిష్టాపురం పంచాయతీల్లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ‘గడప గడపకు కాంగ్రెస్’ కార్యక్రమం నిర్వహించారు. రైతు డిక్లరేషన్‌ను ప్రచారం చేశారు. అనంతరం రవి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, భావ్‌సింగ్, బి.సుందర్, రామారావు, వీరా, లాల్‌సింగ్, చిట్టిబాబు, కృష్ణ, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు టన్నుల నల్లబెల్లం ధ్వంసం

మహబూబాబాద్ రూరల్ : గుడుంబా కేసుల్లో పట్టుబడ్డ నల్లబెల్లం నిల్వల్లో నుంచి ఐదు టన్నులను మొదటి విడతలో భాగంగా మున్నేరు వాగులో మంగళవారం పడేసి ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. జిల్లా కేంద్ర శివారులోని మున్నేరువాగులో ఎక్సైజ్ శాఖ అధికారులు నల్లబెల్లాన్ని మంగళవారం ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు ఆదేశాల మేరకు మహబూబాబాద్ డీపీఈఓ పి.కిరణ్‌నాయక్ పర్యవేక్షణలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది గుడుంబా కేసుల్లో పట్టుబడ్డ నల్లబెల్లం బస్తాలను మున్నేరువాగులో ధ్వంసం చేసినట్టు తెలిపారు. మిగితా బెల్లాన్ని బుధ, గురువారాల్లో ధ్వంసం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు కృష్ణమూర్తి, మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి



మహబూబాబాద్ అర్బన్ :డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, తదితరులు

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని జమాండ్లపల్లిలోని 2వ, 3వ వార్డులను కమిషనర్ ప్రసన్నరాణితో కలిసి చైర్మన్ మంగళవారం సందర్శించారు. అనంతరం చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. పట్టణంలో 36 వార్డులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ జిల్లాకే ఆదర్శంగా నిలపాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బండి ఇందిర వెంకన్న, వట్టం జ్యోత్స్న శివ, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు శ్రీహరి, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో ‘దండోరా’ పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మాదిగ హక్కుల దండోరా నాయకులు సందర్శించి పరిశీలించారు. సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం దండోరా జిల్లా అధ్యక్షుడు హెచ్.వెంకటేష్ మాట్లాడారు. వర్షాలకు దోమలు, ఈగల ప్రబలు విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో దండోరా జిల్లా ప్రధాన కార్యదర్శి జినుక రవీందర్, నాయకులు సాయి, చందర్, నరేష్, శ్రీను, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పరిశీలన



కేసముద్రం : ఇనుగుర్తిలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్, సర్పంచ్

కేసముద్రం : ఇనుగుర్తి మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, సర్పంచ్ దార్ల రామ్మూర్తి మంగళవారం సందర్శించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంగన్‌వాడీ సెంటర్ల భవనాలను పరిశీలించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉరుస్తుండడంతో వాటిని మరో చోటికి మార్చాలని అంగన్‌వాడీ టీచర్లను సూపర్‌వైజర్ ఆదేశించారు. సెంటర్లను మార్చే భవనం ఎదుట ఉన్న పిచ్చి మొక్కలను అంగన్‌వాడీ టీచర్లు, సర్పంచ్, సూపర్‌వైజర్ కలిసి తొలగించారు.

ప్రత్యేక అధికారి తనిఖీ

డోర్నకల్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి ఛత్రునాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని మైనార్టీ వెల్ఫేర్ హాస్టల్‌ను, కేజీబీవీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు, భోజనం, టాయిలెట్లు, రికార్డులను పరిశీలించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

దంతాలపల్లి : మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో వాయిదా వేసినట్లు చెప్పారు.

ఒకరిపై కేసు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని కంబాలపల్లి గ్రామంలోని యాస రంగారెడ్డి ఇంటి స్థలానికి సంబంధించిన కసీలను సప్పిడి రాంరెడ్డి తొలగిస్తుండగా రంగారెడ్డి భార్య విజయ అడ్డుకోగా ఆమెను రాంరెడ్డి నెట్టివేయగా గాయాలయ్యాయి. రంగారెడ్డి ఫిర్యాదు మేరకు రాంరెడ్డిపై కేసు నమోదు చేశామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపారు.

రేపు సర్వసభ్య సమావేశం

మరిపెడ : రేపు (గురువారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు అధ్యక్షత వహిస్తారని, ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక సకాలంలో హాజరు కావాలని కోరారు.

సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం



తొర్రూరు : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తొర్రూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, దయాకర్‌రావు చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సునిత, గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు..

దంతాలపల్లి/ నెల్లికుదురు : వీఆర్వోలు దంతాలపల్లి, నెల్లికుదురు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో జేఏసీ చైర్మన్ మధుసూదన్, వీఆర్వోలు రేణుక, తోట వెంకన్న, బాలరాజు, ప్రసన్న, యాకయ్య, రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

దోర్నకల్ : మణిపూర్ ఘటనను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ వరకు మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్లలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు మానవహారం నిర్వహించారు. ర్యాలీని సీఎస్ఐ బిషప్ డాక్టర్ కె.పద్మారావు ప్రారంభించి మాట్లాడారు. మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ పి.జాన్‌పాల్‌రెడ్డి, పాస్టర్లు జిల్లా అబ్రహం, రమేష్‌పాల్, నాయక్, సామ్యేల్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో విద్యార్థినుల నిరసన

కేసముద్రం : కేసముద్రం విలేజ్ జెడ్పీఎస్ఎస్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు చందు మాట్లాడారు. మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పొదుపుతోనే మహిళల ఆర్థికాభివృద్ధి

కురవి : పొదుపు ద్వారానే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించగలరని జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో అధ్యక్షురాలు మామిడాల అలేఖ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గాయత్రి మండల సమాఖ్య 15వ వార్షిక మహాసభలో 2022-23 ఆర్థిక సంవత్స ఆర్థిక లావాదేవీలను, సాధించిన ప్రగతిని ప్రవేశ పెట్టారు. అలాగే 2023-24 సంవత్సర లక్ష్యాన్ని నిర్దేశించారు. గత మార్చిలో నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. బదిలీపై వెళ్లిన కిరణ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మహిళలు విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాస్, స్త్రీ నిధి ఆర్‌ఎం మధుసూధన్, ఏపీఎం సత్యనారాయణ, ఐకేపీ సిబ్బంది రామారావు, ఇందిర, సతీష్, ఉషా, వసుమతి, మంజుల, కృష్ణయ్య, సులోచన, దేవేందర్, శోభ, జనసీదేవి, సుష్మా పాల్గొన్నారు.